జన్మదిన శుభాకాంక్షలు







డా॥ చదలవాడ కృష్ణమూర్తి గారు

మాజీ శాసనసభ్యులు, తిరుపతి

మాజీ ఛైర్మన్, టిటిడి పాలకమండలి

శ్రీమతి చదలవాడ సుమలత
ట్రస్టీ, సి.వి.ఎస్. కృష్ణమూర్తి తేజ ఛారిటీస్

శ్రీమతి చదలవాడ కవిత
ట్రస్టీ, సి.వి.ఎస్. కృష్ణమూర్తి తేజ ఛారిటీస్

మేనేజింగ్ పార్టనర్స్, కృష్ణతేజ గ్రూప్ థియేటర్స్, తిరుపతి

జీవిత పయనంలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఉన్నత శిఖరాలను చేరుకున్న స్వయం కృషీవలుడు, పారిశ్రామికవేత్త, సీనియర్ రాజకీయవేత్త, ఆధ్యాత్మిక చింతనాపరులు, మానవతావాది... తెలుగు గంగా జలంతో తిరుపతి ప్రజల దాహార్తిని తీర్చిన అభినవ భగీరథుడు, టిటిడి పాలక మండలి అధ్యక్ష హోదాలో సామాన్య భక్తులకు శ్రీవారిని చేరువ చేసిన ఆధ్యాత్మిక వేత్త, స్విమ్స్ ప్రాణదాన ట్రస్ట్ రూపకర్త, తిరుపతిని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేసిన మూలపురుషుడు, చదలవాడ ట్రస్ట్ ద్వారా విద్యా దానం, వైద్య సేవలు అందిస్తున్న వినయశీలి, ఆదర్శ వ్యాపారవేత్త, మా పెద్దాయన **చదలవాడ కృష్ణమూర్తి గారికి** జన్మదిన శుభాకాంక్షలు

ADMISSIONS ARE IN PROGRESS

BDS, MDS, B.Tech., B.Arch, MBA, MCA, PHARMACY, DEGREE, POLYTECHNIC

EAPCET / ECET / ICET / PGCET / POLYCET CODE: **CHDL**

అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు మరియు సిబ్బంది

KRISHNA THEJA GROUP OF INSTITUTIONS

MANAGED BY CVS KRISHNAMURTHY TEJA CHARITIES, Chadalawada Nagar, Tirupati - 517506

- Chadalawada Ramanamma Engineering College (A)
- Chadalawada Ramanamma Engineering (Polytechnic 2nd Shift)
- CKS Theja Institute of Dental Sciences & Research
- Chadalawada Aruna College of Nursing (Proposed)
- Chadalawada Aruna School of Architecture(CASA)
- Krishna Theja Degree & PG College
- Krishna Theja College of Pharmacy
- Krishna Theja College of Hotel Management
- Krishna Theja College of Education
- Krishna Theja Junior College
- Krishna Theja Public School

KRISHNA MURTHY EDUCATIONAL ACADEMY CKSM మాతృ దేవో భవ

✆ 91604 51118, 72079 41253, 72079 41252, 84988 10517 (Diploma), 63053 87277



మల్లయ్యకొండకు పర్యాటక శోభ

- వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు రూ.45 లక్షలు మంజూరు
- రూ.8.5 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలు
- రూ.30 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ పర్యాటక శోభ సంతరించుకోనుంది. రెండో శ్రీశైలంగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొండకు వచ్చే భక్తులు, పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సేద తీరేందుకు వీలుగా గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద ఓ వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు సుమారు రూ.45 లక్షల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు మంజూరు చేసింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తైతే సందర్శకులు వాచ్‌టవర్ పైకెక్కి మల్లయ్యకొండ చుట్టూ విస్తరించి ఉన్న పచ్చదనం పరుచుకున్న అడవులు, ఎత్తైన కొండలు, లోతైన లోయలు, అడవిలో దాగున్న ప్రకృతి అందాలను తిలకించవచ్చు. పగోడాల కింద ఉల్లాసంగా, ఉత్సాహంగా సేదతీరవచ్చు. దీంతో పాటుగా పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కొండపైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు, గౌరమ్మకుప్ప వాచ్‌టవర్ నుంచి గోశాల వద్దకు మెట్లు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి మరో రూ.30 లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు అటవీ శాఖ ఎఫ్ఆర్వో జయప్రసాదరావు తెలిపారు.

ప్రకృతి అందాల నడుమ మల్లన్న

సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. ప్రతి సోమవారం, కార్తీక సోమవారాల్లో అయితే కొండకు వచ్చే భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు కొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కొండపైకి చేరుకునేందుకు ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సులతో పాటు కొండ కింద నిత్యం ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

కొండపైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న మల్లయ్యకొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తుంది. శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్లగాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్, ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్‌ల నుంచి చూస్తే ఎత్తైన పచ్చని కొండలు, లోతైన లోయలు, పచ్చదనం పరుచుకున్న చెట్లు, నింగి నేల ఏకమైనట్లుగా కనిపించే దృశ్యాలు మనసును కట్టిపడేస్తాయి. కొండ కింద నుంచి కొండ పైకి ప్రయాణించేటప్పుడు వంపులు తిరిగిన ఘాట్ రోడ్డు మలుపులు ఎంతగానో అబ్బురపరుస్తాయి.

రూ.45 లక్షలతో వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలు

మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కి.మీ. ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తైన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్‌టవర్‌తో పాటు రెండు పగోడాల నిర్మాణాలు చేపడుతున్నారు. గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ (ప్రస్తుతం వాచ్‌టవర్ నిర్మిస్తున్న ప్రదేశం) నుంచి చూస్తే సుమారు 150 కి.మీ. పైగా దూరంలో ఉన్న తిరుమల కొండలు కనిపిస్తాయి. ప్రస్తుతం వాచ్‌టవర్‌ను 20 అడుగుల ఎత్తుతో రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు. వాచ్‌టవర్ పైకి ఎక్కి చూస్తే సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో చుట్టూ విస్తరించి ఉన్న దట్టమైన అడవులను చూడవచ్చు. దీంతో పాటుగా వాచ్‌టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మిస్తున్నారు. దీంతో పాటుగా కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు చేపడుతుండగా పనులు చివరి దశలో ఉన్నాయి.

వాచ్‌టవర్‌తో అనేక ప్రయోజనాలు

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్లు నరికివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది.

పూర్తి కావస్తున్న పనులు



మల్లయ్యకొండపైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వాచ్‌టవర్, రెండు పగోడాలు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం. వీటి నిర్మాణం పూర్తయితే కొండకు వచ్చే భక్తులు మరింత ఆహ్లాదాన్ని పొందవచ్చు. వీటితో పాటు కొండ పైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి సమారు రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న వాచ్‌టవర్

వాచ్‌టవర్ వద్దకు తాపల నిర్మాణం కోసం చదును చేసిన స్థలం

గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న పగోడాలు

చందనాలంకారంలో వీరభద్రుడు



చందన అలంకారంలో వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో స్వామి, అమ్మవార్లకు చందన అలంకార వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ అమ్మవారికి, వీరభద్రుడికి ప్రత్యేక చందన అలంకార అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అక్షయ తృతీయ పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు ఆలయానికి వచ్చి చందన అలంకారంలో ఉన్న వీరభద్రస్వామి వారు, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అక్షయ తృతీయ విశిష్టత గురించి చందన అలంకారం విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనుకున్నదే చేశారు..!

- అంశాల వారీగా ఆమోదం
- నాలుగు అంశాల తిరస్కరణ
- నామమాత్రంగా కౌన్సిల్ సమావేశం



కశ్మీర్ ఉగ్ర దాడి మృతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న కౌన్సిలర్లు


మదనపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మదనపల్లె మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గతం కంటే భిన్నంగా సాగింది. కౌన్సిలర్ పెరవలి రాజేశ్‌తో పాటు ఒకరిద్దరు ఎజెండాలోని అంశాన్ని అంకెల వారీగా చెబుతూ, ఆమోదం, తిరస్కరణ (రద్దు) అంటూ సమావేశాన్ని నిమిషాల వ్యవధిలోనే ముగించేశారు. మార్చి నెలలో సమావేశంలో తొమ్మిది వార్డుల్లో రూ.5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎజెండాలో పేర్కొని, మిగిలిన వార్డులను గాలికొదిలేశారని వైసీపీ కౌన్సిలర్లు ఆందోళన చేశారు.

గత నెల ఎజెండా తరహాలోనే ఇప్పుడు కూడా 12 వార్డులకు రూ.5.27 కోట్లు పెట్టి, మిగిలిన 23 వార్డులను గాలికొదిలేశారని, ఈ ఎజెండాను కూడా రద్దు చేయాలని కౌన్సిలర్లు ఎస్.కరీముల్లా, మార్పూరి నాగార్జునబాబు డిమాండ్ చేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనికి స్పందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ ప్రతిసారి సమావేశాన్ని రద్దు చేస్తే తాగునీరు, శానిటేషన్, వీధిలైట్లు, తదితర పనులు, సేవలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రయారిటీ ప్రకారం, వార్డుల్లో ప్రజలకు అవసరమయ్యే పనులను మాత్రమే తాను ర్యాటిఫై చేస్తున్నట్లు ప్రకటించారు. 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి మాట్లాడుతూ తమ వార్డుకు మంజూరు చేసి అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక వైసీపీ కౌన్సిలర్లు ఎజెండాలోని 20వ అంశాన్ని రద్దు చేశారని వాపోయారు. మున్సిపాలిటీలో టీడీపీ తరఫున విజయం సాధించింది తానేనని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా..తన వార్డులో అభివృద్ధికి అడ్డు తగలడం ఏంటని ప్రశ్నించారు. పట్టణంలోని 35 వార్డుల్లో 33 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా, ఎన్నడూ లేని విధంగా ఇద్దరు మినహా సమావేశానికి అంతా హాజరయ్యారు.

సాధారణ, అత్యవసర సమావేశ ఎజెండాల్లోని నాలుగు అంశాలు మినహా మిగిలిన 28 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల కార్యాలయం పనిమీద విజయవాడకు వెళ్లడంతో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ శ్రావణి వ్యవహరించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు ఆత్మశాంతి కలగాలని కౌన్సిల్ రెండు నిమిషాల మౌనం పాటించింది. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ తీవ్రవాదుల దాడి నేపథ్యంలో కేంద్రం తీసుకునే ఎలాంటి చర్యలకైనా తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

కన్నీరు మిగిల్చిన చామంతి

- దిగుబడి రాక తీవ్ర నష్టం



దిగుబడి రాని చామంతి పూల తోట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు చామంతి పూల తోట కన్నీరు మిగిల్చింది. వైరస్‌తో పాటు నీటి సమస్యతో పంట అనుకున్న ప్రకారం దిగుబడి రాకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చామంతి తోటలను సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుమారు 30 ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ఎకరా చామంతి తోటను సాగు చేయాలంటే సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 5 టన్నుల పూలు రావాల్సి ఉంది. కానీ వైరస్, నీటి సమస్యతో ఎకరాకు 2 టన్నులు మాత్రమే వచ్చాయి. వైరస్ కారణంగా పూల నాణ్యత కూడా తగ్గడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన పంటకు ఆశించిన రీతిలో ధర లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కిలో చామంతి రూ.100 నుంచి రూ.110 ఉండేది కానీ ప్రస్తుతం రూ.60 మాత్రమే ధర ఉండడంతో పెట్టుబడి కూడా రాలేదు. మండలానికి చెందిన భీమవరం, జయచంద్రారెడ్డి ఐదెకరాలు, పెసల శివారెడ్డి 8 ఎకరాలు, క్రిష్టారెడ్డి 8 ఎకరాల్లో మరికొందరు రైతులు చామంతి తోటలను సాగు చేశారు. ఈ ఏడాది చామంతి పూలు తమను అప్పులపాలు చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైరస్‌తో తీవ్ర నష్టం



చామంతి తోటకు వైరస్ సోకడంతో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడిలో సగం కూడా రాలేదు. మండలంలో నీటి సమస్య కూడా అధికంగా ఉంది. ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందితే రైతులు సంతోషంగా ఉంటారు.

- భీమవరం జయచంద్రారెడ్డి, రైతు, ఒంటిమిట్ట

గంగోత్రిలో గల్లంతైన యువకుడు మృతి

మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేసుగారి బాలకృష్ణ (30) మంగళవారం హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఉన్న గంగోత్రి కొలనులో గల్లంతయ్యాడు. అప్పటికే చీకటి పడడంతో అతడి మిత్రులు, అధికారులు చేసిన గాలింపు చర్యలు సఫలం కాలేదు. దీంతో బుధవారం ఉదయం సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ములకలచెరువు నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, సిబ్బంది మానస సరోవరంలోని బోట్‌ను గంగోత్రిలోకి తరలించారు. రెండు శాఖల సిబ్బంది బోటులో కొలనులోకి గాలించి తాళ్లసాయంతో బాలకృష్ణ మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం సాయంత్రం బి.కొత్తకోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్‌డీఏ ప్రిలిమినరీలో 28 మంది

సైనిక్ స్కూల్ విద్యార్థులకు అర్హత

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా జరిగిన రాత పరీక్షలో కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన 28 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ సిహెచ్ పరదేశి తెలిపారు. ఏప్రిల్ 13న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వీరు సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) నిర్వహించే ఇంటర్వ్యూలో పాస్ కావాల్సి ఉంది. కలికిరి సైనిక్ స్కూల్ నుంచి 64 మంది ప్రిలిమినరీ పరీక్షలకు హాజరుకాగా అందులో 28 మంది అర్హత సాధించడం అరుదైన అంశమని తెలిపారు. ఇందులో ఈ ఏడాది 2024-25 బ్యాచ్ 12వ తరగతి విద్యార్థులు 18 మంది క్వాలిఫై కాగా, పది మంది గతేడాది బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులని వివరించారు. గత నాలుగు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థుల్లో ఇప్పటి వరకు 18 మంది ఎంపికై భారత సాయుధ దళాల్లో చేరినట్లు తెలిపారు. ఎన్‌డీఏ ప్రవేశ పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది బ్యాచ్‌కు (2024-25) చెందిన విద్యార్థులు 12వ తరగతి పూర్తి కాకుండానే గత అక్టోబరులో జరిగిన ప్రవేశ పరీక్షలకు హాజరయ్యారు. అందులో ఇటీవలే పూర్తయిన ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో నలుగురు విద్యార్థులు ఎంపికైన విషయం తెలిసిందే.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుకు చెందిన రవికుమార్ నిమ్మనపల్లి అగ్రహారం మార్గంలో బైక్‌పై వస్తుండగా తరిగొండవారిపల్లికి చెందిన పులి రెడ్డెప్పరెడ్డి తన ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు రెడ్డెప్పరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు



మద్యంతో పట్టుబడిన ఆనందకుమార్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని మినికి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీస్ గంగిరెడ్డి, శ్రీనివాసులతో కలిసి తనిఖీ నిర్వహించి అనంద్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 43 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా : ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లి మండలం కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మదనపల్లికి చెందిన అశోక్‌కుమార్ (22), ప్రదీప్ (24) మంగళవారం రాత్రి తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం నుంచి మదనపల్లికి వస్తుండగా ఎగువమాచిరెడ్డిగారిపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లి తరలించగా అక్కడ డాక్టర్లు తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



విలపిస్తున్న మృతుడి తండ్రి ఇబ్రహీం, నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

చిన్నమండెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని షిఫాయత్‌ఖాన్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండెం మండల కేంద్రానికి చెందిన షిఫాయత్‌ఖాన్, ఖాదర్‌వలీలు ద్విచక్రవాహనంలో తన సొంత అవసరాల నిమిత్తం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యాహ్న సమయంలో కడప-బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని షిఫాయత్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా ఖాదర్‌వల్లి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం శివారులోని భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో ఆటో, స్కూటర్ ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఉదయం ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన రెడ్డిపోగు శంకరయ్య, క్రిష్ణయ్య బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొనడంతో కృష్ణ తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. శంకరయ్య కాలికి గాయమైంది. వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పందెం కోళ్లను వేలం వేసిన పోలీసులు



కోడిని వేలం వేస్తున్న పోలీసులు

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు గ్రామం సమీపంలోని ఒక తోటలో జరుగుతున్న కోడి పందాలపై దాడులు చేసిన కలికిరి పోలీసులు పందెంరాయుళ్లతో పాటు నాలుగు పందెం పుంజులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం జరిగిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న పందెంకోళ్లను వేలం వేసేందుకు వాయల్పాడు కోర్టు న్యాయాధికారి అనుమతి తీసుకున్నారు. ఆ ప్రకారం బుధవారం పోలీసుస్టేషను ఆవరణలో వేలం నిర్వహించగా రూ.6500లకు వేలం పాట నిలిచింది. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కోర్టు పద్దులో జమచేయనున్నట్లు కలికిరి ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్‌బాషా, హెచ్‌సీ మదనమోహన్‌రెడ్డి, పోలీసులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

ఆశయం ఘనం...

అమలు శూన్యం!

● నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



పీలేరులో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు

● అలంకారప్రాయంగా కూలీల సంక్షేమ చట్టం
● పరిహారం కోసం కూలీల ఎదురుచూపు
● కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించిన వైసీపీ సర్కారు

అసంఘటిత రంగంలోని కూలీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణలో విఫలమవుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయాల్లో కార్మికులకు పరిహారం, కార్మికుల పిల్లల చదువులకు సాయం, స్కాలర్‌షిప్‌లు అంటూ ఆకర్షణీయమైన మాటలు చెబుతూ కార్మికులకు దశాబ్ద కాలంగా పరిహారం ఇవ్వలేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల పండుగ అయిన మేడే సందర్భంగానైనా తమ సమస్యల గురించి ఎవరైనా పట్టించుకోకపోతారా అంటూ వారు ఆశగా చూస్తున్నారు.

పీలేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగానిదే అగ్రతాంబూలం. తామున్న చోటు లేక సమీప ప్రాంతంలోనే భుక్తి మార్గం మార్గం దొరుకుతుందన్న ఆశతో చాలామంది రైతులు, రైతు కూలీలు, సాధారణ కూలీలు తమ సంప్రదాయ వృత్తులను వదిలి భవన నిర్మాణ రంగంలోకి వెళుతుంటారు. శారీరకంగా దృఢంగా ఉన్నన్నాళ్లూ ఎటువంటి రిటైర్మెంట్ లేకుండా పనిచేసుకునే అనువైనది నిర్మాణం రంగం. అయితే నిత్యం ప్రమాదపుటంచుల్లో పనిచేసే ఆ రంగంలోని తాపీ మేస్త్రీలు, కూలీలకు రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట భవన నిర్మాణ రంగ కూలీలు మృత్యువాతపడుతూనే ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా మేస్త్రీలు, గృహ యజమానులు అందించే కాసింత పరిహారంతోనే ప్రమాదానికి గురైన వారు సరిపుచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రమాదాల కారణంగా అంగవైకల్యం పొందిన వారైతే చేసేది లేక ఇంటి పట్టునే ఉంటూ నిరాశతో జీవితం గడుపుతూ ఉంటారు. నిర్మాణ రంగంలోని ఇటువంటి ఇబ్బందులను తొలగించి మేస్త్రీలు, కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు-1999ను అమలు చేస్తున్నాయి. కేవలం నామమాత్రపు రుసుంతో కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పించేందుకు ఈ చట్టం రూపొందించబడింది. అయితే ఈ పథకం కేవలం అలంకారప్రాయంగా, ప్రభుత్వానికి ప్రచార అస్త్రంగా మిగిలిపోయిందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కార్మిక శాఖ అధికారుల ప్రోద్బలంతో తమ దగ్గర పనిచేస్తున్న కార్మికులకు ఎన్నో ఆశలు కల్పించి తాము నమోదు చేయిస్తున్నా వారికి ఎటువంటి పరిహారం అందడం లేదని వారు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించడంతో కార్మికులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

పీలేరు కార్మిక శాఖ కార్యాలయ పరిధిలో...

పీలేరు, కేవీపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల, తవణంపల్లె, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పాకాల మండలాల నుంచి ప్రస్తుతం 15 వేల మంది గుర్తింపు పొందిన కార్మికులు ఉండగా కార్మిక శాఖ వద్ద గుర్తింపు కార్డులు తీసుకోవడానికి ఆసక్తి చూపని వారు మరో 20 వేల మంది ఉన్నారని కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

పరిహారం కోసం 80 మంది ఎదురుచూపులు

పీలేరు కార్మిక శాఖ పరిధిలోని 11 మండలాల పరిధిలో 80 మంది కార్మికులు, వారి కుటుంబాలు పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అందులో రూ.5 లక్షల పరిహారం అందాల్సిన ప్రమాద మరణం కేసు చిన్నగొట్టిగల్లు మండలంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంది. పీలేరు మండలంలో ఎనిమిది, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, ఐరాలలో 14, తవణంపల్లెలో ఒకటి, చిన్నగొట్టిగల్లులో రెండు, పాకాలలో రెండు సహజ మరణం కేసులు, దహనక్రియల కోసం పీలేరులో ఎనిమిది, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, ఐరాలలో 14, తవణంపల్లెలో ఒకటి, చిన్నగొట్టిగల్లులో మూడు, పాకాలలో రెండు కేసులు పరిహారం కోసం వేచి చూస్తున్నాయి. వివాహ కానుక కోసం పీలేరులో రెండు, ప్రసూతి సాయం కోసం పీలేరులో నాలుగు, రొంపిచెర్లలో మూడు, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, తవణంపల్లెలో రెండు, చిన్నగొట్టిగల్లులో రెండు, పాకాలలో ఐదు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మిక శాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇవి మరిన్ని పెరిగే అవకాశం ఉందని కార్మిక సంఘ నేతలు చెబుతున్నారు.



పరిహారం అందితే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది



సకాలంలో పరిహారం అందితే కార్మికులకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. అలా కాకుండా ఏళ్ల తరబడి ఇవ్వకపోతే ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుంది. పరిహారం చెక్కులు చివరగా 2014లో అందించారు. అదీ 2009లో పెండింగ్‌లో ఉన్న వాటిని 2014లో పంపిణీ చేశారు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడేమో కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించారని చెప్పారు. మా నిధులు మాకిమ్మని ఎన్నోసార్లు ఎమ్మెల్యేల దగ్గర నుంచి మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వినతిపత్రాలు అందజేశాం. కూటమి ప్రభుత్వమైనా మా గురించి పట్టించుకుంటుందేమోనని ఎదురు చూస్తున్నాం.

● బలరాం, అధ్యక్షుడు, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

సంక్షేమ బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలు

- పనిచేసే ప్రదేశాల్లో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షల పరిహారం. 50 శాతం లేదా అంతకు మించి అంగవైకల్యం పొందిన వారికి రూ.లక్ష పరిహారం. 26 శాతం నుంచి 49 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు పరిహారం. 25 శాతం వరకు అంగవైకల్యం పొందిన వారికి రూ.25 వేలు పరిహారం.
- సాధారణ మరణానికి రూ.60 వేల ఆర్థిక సాయం
- అంతిమ సంస్కార ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తారు.
- కార్మికుడి భార్యకు రెండు కాన్పులకు రూ.20 వేల ప్రసూతి సాయం లభిస్తుంది.
- భవన నిర్మాణ కార్మికులకు అనారోగ్య సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ.3 వేలకు మించకుండా మూడు నెలల వరకు చెల్లిస్తారు.
- జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ (న్యాక్) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, రాడ్‌బెండింగ్, వడ్రంగి విభాగాలలో రోజుకు రూ.300 శిక్షణ భృతి చెల్లిస్తూ ఉచిత, భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ అందిస్తారు.
- ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారికి జాతీయ పింఛను పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.
- బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన అవివాహితులైన మహిళా కార్మికులు, లబ్ధిదారులైన కార్మికుల కుమార్తెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వివాహ కానుకగా అందిస్తారు.
- కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా ప్రమాదంలో మరణిస్తే రూ.50 వేలు లేదా ప్రమాదం జరిగితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు.



కార్మిక శాఖ కరపత్రం

ప్రభుత్వానికి తెలియజేశాం



పీలేరు కార్యాలయ పరిధిలో 80 కేసులు పెండింగ్‌లో ఉన్న మాట నిజమే. వాటికి నిధులు కేటాయించమని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించాం. నిధులు రాగానే చెల్లింపులు ప్రారంభిస్తాం. నిధులు లేకపోవడంతో సమస్య ఎదురైంది. అలాగని కార్మికులు నిరాశ చెందాల్సిన పనిలేదు. వారు కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుంటే కాస్త ఆలస్యంగానైనా వారికి రావాల్సిన ప్రయోజనాలు అందుతాయి. నిధుల లభ్యతతో సంబంధం లేకుండా మేము నిత్యం కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం.

● ఆనంద్, సహాయ కార్మిక శాఖాధికారి, పీలేరు

'ఉపాధి'తో బహుళ ప్రయోజనాలు

● డ్వామా పీడీ వెంకటరత్నం
● ఫారంపాండ్లు, నీటి తొట్లు పరిశీలన

సుండుపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల ద్వారా రైతులు, ప్రజలు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం సుండుపల్లె, మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో నీటి తొట్లు, ఫారంపాండ్లను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 36 నీటితొట్లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా ప్రస్తుతానికి 28 పూర్తయినట్లు తెలిపారు. ప్రభుత్వం హార్టికల్చర్‌లో భాగంగా 236 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి అనుమతులు ఇచ్చిందని రైతులు మంజూరు చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. అలాగే 300 ఎకరాల్లో గడ్డి పెంపకానికి అనుమతులు వచ్చాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా ఎంతమంది ఉపాధి పనులు చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేలా చూడాలన్నారు. అనంతరం ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో మాలిక్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు గోవిందయ్య, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

50 తులాల బంగారం చోరీ

● తాళాలు వేసిన ఇంట్లో పట్టపగలే బంగారు నగల అపహరణ
● రాయచోటిలో దొంగల హల్‌చల్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో పలుచోట్ల దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో రాయచోటి పట్టణంలోని రాజు మెయిన్ స్కూల్ సమీపంలో విజయభాస్కర్ అనే వ్యక్తి ఇంటిలో రూ.50 లక్షల విలువ గల 50 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... రాజు స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న విజయభాస్కర్ తన కుమార్తెతో కలిసి కంటికి వైద్య పరీక్షల కోసం బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారున. తిరిగి 11.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా డోర్ పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూస్తే వస్తులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 50 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా ఇంటిలోని వెండి వస్తువులను దొంగలు తీసుకెళ్లకుండా అక్కడే పడేశారు. ఈ మేరకు అర్బన్ సీఐ వెంకటచలపతి, ఎస్ఐ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.




చోరీ జరిగిన ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ చలపతి

అలాగే మంగళవారం రాత్రి రాయచోటి పట్టణంలోని బస్టాండు నుంచి బంగ్లా రోడ్డు వద్దకు వెళ్లే దారిలోని కృష్ణ సెల్ పాయింట్‌లో చోరీ చేశారు. ఉదయం షాపు యజమాని పరిశీలించగా షాపులోని రూ.40 వేలు దొంగతనం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై అతను రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అంతేగాక మంగళవారం రాత్రి దొంగలు కృష్ణ సెల్ పాయింట్‌కు పక్కన ఉన్న హోటళ్లల్లో కూడా దొంగతనానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఇటీవల కాలంలో పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసినప్పటికీ దొంగలు ఏదో ఒకచోట దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నారు. బస్టాండుకు ప్రధాన రహదారిలో ఉన్న కృష్ణ సెల్ పాయింట్ దొంగతనం జరగడంతో మిగిలిన షాపుల యజమానులు భయాందోళనలకు గురవుతున్నారు. కొందరు ఆకతాయిలు రాత్రి సమయంలో పాత సైదియా హాలును కేంద్రంగా చేసుకుని అటుగా వెళుతున్న వారిని భయపెట్టి బంగారం, డబ్బులు దోచుకుంటున్నట్లు స్థానికులు చర్చించుకోవడం కొసమెరుపు, పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో పాత సైదియా హాలు దగ్గర, పక్క వీధుల్లో గస్తీ పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

● పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్లు

రాయచోటి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన ఏపీ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి, కలికిరి పట్టణాల్లోని 11 పరీక్షా కేంద్రాల్లో 3981 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో బాలురు 2376 మంది ఉండగా, బాలికలు 1605 మంది ఉన్నారు. జిల్లాకు వచ్చిన ఏపీ పాలీసెట్ అబ్జర్వర్లు ఎంఎస్ సుకుమార్, ఏ.శివకుమార్‌లు పరీక్ష ఏర్పాట్లతో పాటు పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా కోఆర్డినేటర్ పి.శివశంకర్, డీఆర్‌వో మధుసూదన్‌రావు పరీక్షల నిర్వహణపై పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక పారిశుధ్యం పనులు చేపట్టి విద్యార్థులకు అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.



రాయచోటిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్లు

పీలేరు కాలనీల్లో 3 వేల మంది అనర్హులు

● రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్

పీలేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ లబ్ధిదారుల్లో 3,066 మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించామని రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. పీలేరు తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీలేరు పట్టణానికి చెందిన 8,468 మందికి గత ప్రభుత్వం నాలుగు లేఔట్లలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. అనర్హుల వద్ద ఉన్న ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహించిన క్షేత్రస్థాయి విచారణలో ఈ వాస్తవాలు వెలుగు చూశాయన్నారు. మండలంలోని లేఔట్లలో ఇంకా 3200 ఖాళీ స్థలాలు ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం ఇళ్ల లేని వారికి ఇళ్ల కల్పించాలన్న లక్ష్యంతో దరఖాస్తులు తీసుకుంటున్నామని ఇప్పటి వరకు మండలంలో 3043 దరఖాస్తులు అందాయన్నారు. జీవో నెం.30 ద్వారా వివాదాలు లేని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు రాయచోటి డివిజన్‌లో 257 మంది, పీలేరు మండలంలో 73 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పీలేరు మండలంలో రీసర్వే పనులకు తొలిదశలో వేపులబైలు పంచాయతీని ఎంపిక చేయగా, రెండవ దశ కోసం గూడరేవుపల్లె పంచాయతీని ఎంపిక చేశామన్నారు. గూడరేవుపల్లెలో తొలి దశ సర్వే పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సర్వే నెం.93లోని భవంతులపై కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశామని, కోర్టు ఉత్తర్వుల మేరకు వారికి ఎంత పరిహారం ఇవ్వాలో నిర్ధారించుకుంటామన్నారు. సర్వే నెం.93 పూర్తిగా ప్రభుత్వ భూమి అని, జాతీయ రహదారుల నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ భూమికి పరిహారం చెల్లించాల్సిన పనిలేదని, ఆయా భవన యజమానులకు ఇది వరకే స్పష్టం చేశామన్నారు. వారు కోర్టును ఆశ్రయించడంతో పనులు ఆలస్యం అయ్యాయన్నారు. అనంతరం ఆయన పీలేరు మండలంలోని పీజీఆర్ఎస్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, ఎన్‌హెచ్ డీఈ సత్యమూర్తి, డీటీ ప్రసాద్, సర్వేయర్ కీర్తన, తదితరులు పాల్గొన్నారు.



పీలేరు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్

వైభవంగా గంగమ్మ జాతర ప్రారంభం

● ఆకట్టుకున్న వేషధారణలు
● సంబరాల్లో మునిగితేలిన కోడూరు ప్రజలు

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లి జాతర ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతర సంబరాల్లో రైల్వేకోడూరు ప్రజలు మునిగిపోయారు. రాత్రి పూలపల్లకిని ఊరేగిస్తూ అంకాళమ్మ దేవస్థానం వరకు వస్తుంది. అక్కడ అర్ధరాత్రి గంగమ్మతల్లి విగ్రహాన్ని మట్టితో తయారు చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం గంగమ్మను పూలపల్లకీలో గంగమిట్ట వరకు ఊరేగిస్తారు. అర్ధరాత్రి నుంచి వేలాది మంది జనాలు వచ్చి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులు సమర్పిస్తారు. గంగమ్మ నిలిపేచోట వేపమండలతో గుడి తయారు చేశారు. ఇక్కడే గంగమ్మను నిలబెడతారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమౌతాయి. కాగా వివిధ రకాల అమ్మవారి వేషాలు, విజయవాడ తప్పెట్లు, డ్రమ్స్, పొడుగు మనుషులు, పొట్టి మనుషుల వేషాలు, పెద్ద, పెద్ద అమ్మవారి వేషాలు తదితరవి ప్రజలను ఆకట్టుకున్నాయి. గంగమిట్ట, ప్రధానదారి, అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలంకరణలు చేశారు. ప్రధాన రహదారిలో గంగమ్మతల్లి ప్రతిమలతో కూడిన విద్యుత్ బోర్డులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



గంగమిట్ట వద్ద వేపమండలతో ఏర్పాటు చేసిన గుడి



ప్రజలను ఆకట్టుకున్న అమ్మవారి వేషాలు

150 మందితో పోలీసు బందోబస్తు

గంగమ్మతల్లి జాతరకు 150 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, ఎస్ఐ జి.నవీన్‌బాబు తెలిపారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ జాతర సందర్భంగా 34 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాతో నిరంతరాయంగా నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్ఐలు, హోంగార్డులు తదితర సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. అపూర్వం


ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

సిద్ధవటం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వమని పలువురు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్‌నగర్, జీవీఎస్ ఓరియంట్ హైస్కూల్‌లో 1995 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గంజి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కలయిక ఒక పండుగ లాంటిదన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి : తహసీల్దార్

రాజంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం, పట్టణంలో నివసిస్తున్న రేషన్‌కార్డుదారులు అందరూ ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు పీరుమున్ని తెలిపారు. బుధవారం బోయనపల్లె చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న ఈకేవైసీని పరిశీలించి డీలర్ దొంతు వెంకటలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో రాఘవ, గ్రామ సేవకులు సర్వేశ్వర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారిణి డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులైన లెప్రసీ, ఎయిడ్స్, టీబీలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమని వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారిణి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం చేపట్టిన పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎయిడ్స్‌పై అవగాహన పెరగాలని, ప్రభుత్వ, ప్రభుత్వేతర అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్ మాట్లాడుతూ లెప్రసీ, ఎయిడ్స్, టీబీ తదితర వ్యాధులపై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో హైరిస్క్ గ్రూప్ పాపులేషన్‌కు సంబంధించిన హాట్ స్పాట్‌ను గుర్తించి తప్పిదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ అనూష హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా మందులు, సీడీ 4, వైరల్ లోడ్ పరీక్షల ఆవశ్యకతను వివరించారు. స్వచ్ఛంద సంస్థల ప్రాజెక్టు డైరెక్టర్స్, మేనేజర్స్, క్షేత్ర స్థాయి సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు పీరుమున్ని

రాజంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశానికి బుధవారం రాజంపేటలో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నికల్, ఫార్మసి కళాశాలలో పరీక్ష నిర్వహించారు. పాలిసెట్ కో ఆర్డినేటర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుధాకర్ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్షలకు 975 మంది హాజరు కావాల్సి ఉండగా 892 మంది హాజరయ్యారు. 83 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను రాజంపేట తహసీల్దారు పీరుమున్ని, ఎంఈవో సుబ్బరాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మన్నూరు సీఐ కుళాయప్ప, సిబ్బంది ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎంపీపీగా లక్ష్మీదేవి


ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీదేవి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎంపీపీగా నల్లగొండు లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఉన్న ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి అనారోగ్యం వల్ల మూడు నెలలు సెలవు పె ట్టారు. దీంతో మండల ఉపాధ్యక్షురాలిగా ఉన్న నల్లగొండు లక్ష్మీదేవిని ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ పై అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుళాయిబాబు సమక్షంలో ఇన్‌చార్జి ఎంపీపీగా లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలో నీటి సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన మేడా విజయశేఖర్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ బాషా తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి, వినోద్‌రెడ్డి, ఎంవీ రమణ, దత్తాత్రేయ, కట్టా యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాభారత యజ్ఞం ప్రారంభం

రామాపురం, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన మహాభారత యజ్ఞాన్ని గురువారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య, వడదెబ్బ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటో రుణాలకు ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

రామాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆటో రుణాలకు ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జాషువా పేర్కొన్నారు. మండలంలోని మూడు బ్యాంకులు ఎస్బీఐ (1), ఏపీజీబీ (1), యూనియన్ బ్యాంక్ (1) మొత్తం మూడు యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ పోర్టులో వారి ధ్రువీకరణ పత్రాలను జతపరిచి మే 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'ఏపీసీసీ చీఫ్‌ను హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గం'

రాయచోటిటౌన్, ఏప్రిల్30(ఏప్రిల్): ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి కూడా వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు.

వాలీబాల్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రాయచోటిటౌన్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో గౌస్‌బాషా తెలిపారు. ఈ అవకాశాన్ని అన్నమయ్య జిల్ల పరిధిలోని బాలబాలికలు సద్వినియోగం చేసుకొని వాలీబాల్ శిక్షణ పొందాలని ఆయన కోరారు. ఆసక్తిగల బాల, బాలికలు 8143863618కు ఫోన్‌చేయాలన్నారు.

5న మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని స్థానిక ఎంపడీవో కార్యాలయంలో 5వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని స్థానిక ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు తప్పక హాజరుకావాలని సూచించారు.

కులవివక్షను రూపుమాపుదాం

రామాపురం, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): మండలంలో కులవివక్ష లేకుండా చేద్దామని డిప్యూటీ తహసీల్దార్ కృపావతి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లి పంచాయతీ అడపల మాలపల్లిలో గురువారం పౌరహక్కుల దినోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అగ్రకులాల వారు వివక్షత చూపుతుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ సమ్మత్‌ఖాన్, వీఆర్వోలు వెంకటసుబ్బయ్య, రాధిక, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

వీరబల్లి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వీరబల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మోహన్‌నాయక్, ఎంపీడీవో నూర్జహాన్‌లు సూచించారు. బుధవారం వీరబల్లి మండలం దిగువరాచపల్లి గ్రామ పంచాయతీలోని పెద్ద హరిజనవాడలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీఆర్‌వో నరసింహులు, పంచాయతీ సెక్రటరీ సంజీవరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తోళ్ల సురేంద్ర, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట్రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ - ఇరువురికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై బుధవారం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో ఇరువురు గాయపడ్డారు. ఎస్ఐ నవీన్‌బాబు తెలిపిన వివరాల మేరకు... కడప వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని స్థానికులు వెంటనే రైల్వేకోడూరు ప్రభు త్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాగా పూర్తి వివరాలు అందాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

మైనార్టీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం


హజ్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఏప్రిల్30(ఏప్రిల్):రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన విజయవాడలోని హజ్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర చైర్మన్ హసన్ బాషాను కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హజ్ యాత్రను సులభతరం చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాత్రమే అన్నారు. చంద్రబాబు హైదరాబాద్, నాం పల్లిలో 12 అంతస్తుల హజ్ భవనాన్ని నిర్మించి హజ్‌యాత్రికులు నేరుగా జిద్దాకు వెళ్లేందుకు విమాన సౌకర్యం కల్పించారన్నారు. విజయవాడలో రూ.80 కోట్లతో హజ్‌హౌస్‌ను నిర్మించారన్నారు. కడపలో కూడా రూ.12 కోట్ల విలువైన స్థలంలో 22 కోట్లతో హజ్ హౌస్ భవనాన్ని నిర్మించారన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌వోలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): గత 2 సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాము. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ 6 సంవత్సరాలు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీరించాలని, ఎన్‌హెచ్‌యంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇ వ్వాలని, ప్రతి నెల శాలరీతో పాటు ఇన్సెంటీవ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాల్‌మోహన్, అహ్మద్ బాషా, భరత్‌కుమార్, శివకుమార్, అనిల్ పాల్గొన్నారు.

'మంగంపేట ఆర్‌ఆర్-5కు పరిహారం అందించాలి'

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఆర్‌ఆర్-5 కాపుపల్లె, కాటమదేవునిగుడి స్థలానికి పరిహారం, పశువుల మేత బీడు స్థలం, శ్మశాన స్థలాల పరిహారం అందించాలని బెరైటీస్ ఆదారిత ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపత్తూరు రామసుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నష్టపరిహారం కోసం ఏడు సంవత్సరాల క్రితం కాపుపల్లెకు నంబర్లు వేశారన్నారు. హైకోర్టులో కేసు ఉన్నందున కాటమదేవునిగుడికి నంబర్లు వేయకూడదని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. సర్వేనంబరు 8లో 72.77 ఎకరాల పవుశుల మేత బీడు, కాటమదేవుని గుడి స్థలం, శ్మశాన స్థలం ఉండగా ప్రస్తుతం ఆ ప్రాంతమంతా సుద్ద, బొగ్గు వ్యర్థాలతో నింపేశారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. సీపీవో సుదర్శన్‌రెడ్డి ఈ విషయంలో ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయన్నారు.

'ఇది తెలుగుదేశం పార్టీ విజయం'


మాట్లాడుతున్న విజయశేఖర్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట ఎంపీపీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోవడం ఆ పార్టీ విజయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నల్లగొండు లక్ష్మీదేవి బాధ్యత స్వీకరణ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టీడీపీ విజయడంకా మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, ప్రముఖ వైద్యుడు మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి, వినోద్‌రెడ్డి ఎంపీటీసీ బాషా, ఎంవీ రమణ, కట్టా యానాదయ్య పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సన్మానం

రాయచోటిటౌన్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష ఎస్ఎస్‌లో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా ఫారిన్ సర్వీస్‌లో భాగంగా పనిచేస్తూ 5 సంవత్సరాలుగా పూర్తి చేసుకుని మాతృసంస్థ అయిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు వెళ్తున్న సందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మురళీధర్‌కు డీఈవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా సమ్మిళిత సెక్టోరియల్ ఆఫీసర్ జనార్థన్, సమగ్ర శిక్ష ఇంజనీరింగ్‌శాఖ డివిజనల్ ఇంజనీర్స్, ఏఈలు మాతృసంస్థకు వెళుతున్న మురళీధర్‌కు శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

గంగమ్మ తల్లికి మాంగ చంద్రహారం బహూకరణ


చంద్రహారంతో విశ్వేశ్వరనాయుడు దంపతులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లి జాతర సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత మాచినేని విశ్వేశ్వరనాయుడు, ఆయన సతీమణి షర్మిల బుధవారం అమ్మవారికి మాంగ చంద్రహారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ అమ్మవారికి మాంగచంద్రహారం చేయించాలని కమిటీ సభ్యులు కోరడంతో త యారు చేయించామన్నారు. జాతరలో అమ్మవారికి వేసే విధంగా ఏర్పాటు చేశామన్నారు.

జనసేన నాయకుడిపై కేసు నమోదు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలం లోని చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన జనసేన రాయలసీమ కన్వీనర్ జోగినేని మణిపై మంగళవారం ఓబులవారిపల్లె పోలీసులు కేసు నమోదు చేసినట్లు బుధవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 10న చెన్నరాజుపోడు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఊరేగింపు చేస్తుండగా పత్తి సుబ్బరాయుడు, పత్తి రాజేశ్వరి దంపతులపై జోగినేని మణి దాడి చేసినట్లు ఈ నెల 11న పత్తిరాజేశ్వరి ఓబులవారిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆన్‌లైన్ ద్వారా తెలిపారు. కేసు నమోదు చేయాలని జిల్లా పోలీసు అధికారి నుంచి ఓబులవారిపల్లె పోలీసులను ఆదేశాలు రావడంతో దీంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ మహేష్ తెలిపారు.

ప్రధాన రహదారిపై పారిశుధ్య చర్యలు



సిద్దవటం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారిపై పారిశుధ్యం పడకేసిందని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందల లభించింది. బుధవారం సిద్దవటం - బద్వేల్ ప్రధాన రహదారిపై పారిశుధ్య చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ మూడు రోజుల్లో పారిశుధ్యం పూర్తిగా మెరుగుపరుస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.1.20 కోట్లు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం డీఎంఎస్‌వో ద్వారా రూ.1.20 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ వెంకటనారాయణ గైర్హాజరయ్యారని, ఉప ఎంపీపీ అక్కి నాగరత్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ శేషమాంబపురంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని, వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ఒక్కో పంచాయతికి రూ.5 లక్షల చొప్పున తాగునీటి సమస్యకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే మండలానికి 78 పశువుల నీటితొట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటివరకు వాటిలో 60 నీటితొట్లను పూర్తి చేశామన్నారు.

పశుగ్రాసం పెంచుకునే రైతులకు రాజంపేట మండలానికి సంబంధించి 350 ఎకరాల్లో పశుగ్రాసం పెంచాలని లక్ష్యం ఇచ్చారని తెలిపారు. ఊటుకూరులో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్య, వైద్యం, ఉపాధి హామీ పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి హరిప్రసాద్ రెడ్డి, ఏవో బాలమునిస్వామి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణం


పదవీ విరమణ పొందిన తహసీల్దార్ రవిని సన్మానిస్తున్న జేసీ తదితరులు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమేనని సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరిండెంట్ రిటైర్డ్ అయిన గడపాల రవి పదవీ విరమణ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవి తన బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించేవాడన్నారు. డీఆర్‌వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ రవి జూనియన్ అసిస్టెంట్ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు 42 ఏళ్లు రెవెన్యూ శాఖలో సేవలందించారన్నారు. రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ మాట్లాడుతూ రవితో కలిసి పని చేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు


లక్ష్మీదేవిని సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని రోడ్లు భవనాల శాఖ ఈఈ సహదేవరెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బి కార్యాలయంలో సబార్డనేట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన గాజుల లక్ష్మీదేవిని బుధవారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఘనంగా సన్మానించారు. గాజుల లక్ష్మీదేవి తమ శాఖలో సుమారు 34 ఏళ్ల పాటు సబార్డనేట్‌గా సేవలందించారన్నారు.



మల్లయ్యకొండకు పర్యాటక శోభ



- వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు రూ.45 లక్షలు మంజూరు
- రూ.8.5 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలు
- రూ.30 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ పర్యాటక శోభ సంతరించుకోనుంది. రెండో శ్రీశైలంగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొండకు వచ్చే భక్తులు, పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సేద తీరేందుకు వీలుగా గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద ఓ వాచ్ టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు సుమారు రూ.45 లక్షల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు మంజూరు చేసింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తైతే సందర్శకులు వాచ్‌టవర్ పైకెక్కి మల్లయ్యకొండ చుట్టూ విస్తరించి ఉన్న పచ్చదనం పరుచుకున్న అడవులు, ఎత్తైన కొండలు, లోతైన లోయలు, అడవిలో దాగున్న ప్రకృతి అందాలను తిలకించవచ్చు. పగోడాల కింద ఉల్లాసంగా, ఉత్సాహంగా సేదతీరవచ్చు. దీంతో పాటుగా పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కొండపైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు, గౌరమ్మకుప్ప వాచ్‌టవర్ నుంచి గోశాల వద్దకు మెటుకులు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి మరో రూ.30 లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు అటవీ శాఖ ఎఫ్ఆర్వో జయప్రసాదరావు తెలిపారు.

ప్రకృతి అందాల నడుమ మల్లన్న

సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. ప్రతి సోమవారం, కార్తీక సోమవారాల్లో అయితే కొండకు వచ్చే భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు కొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కొండపైకి చేరుకునేందుకు ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సులతో పాటు కొండ కింద నిత్యం ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

కొండపైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న మల్లయ్యకొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తుంది. శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్లగాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్, ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్‌ల నుంచి చూస్తే ఎత్తైన పచ్చని కొండలు, లోతైన లోయలు, పచ్చదనం పరుచుకున్న చెట్లు, నింగి నేల ఏకమైనట్లుగా కనిపించే దృశ్యాలు మనసును కట్టిపడేస్తాయి. కొండ కింద నుంచి కొండ పైకి ప్రయాణించేటప్పుడు వంపులు తిరిగిన ఘాట్ రోడ్డు మలుపులు ఎంతగానో అబ్బురపరుస్తాయి.

రూ.45 లక్షలతో వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలు

మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కి.మీ. ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తైన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్ టవర్‌తో పాటు రెండు పగోడాల నిర్మాణాలు చేపడుతున్నారు. గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ (ప్రస్తుతం వాచ్‌టవర్ నిర్మిస్తున్న ప్రదేశం) నుంచి చూస్తే సుమారు 150 కి.మీ. పైగా దూరంలో ఉన్న తిరుమల కొండలు కనిపిస్తాయి. ప్రస్తుతం వాచ్‌టవర్‌ను 20 అడుగుల ఎత్తుతో రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు. వాచ్‌టవర్ పైకి ఎక్కి చూస్తే సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో చుట్టూ విస్తరించి ఉన్న దట్టమైన అడవులను చూడవచ్చు. దీంతో పాటుగా వాచ్‌టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మిస్తున్నారు. దీంతో పాటుగా కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు చేపడుతుండగా పనులు చివరి దశలో ఉన్నాయి.

వాచ్‌టవర్‌తో అనేక ప్రయోజనాలు

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్లు నరికివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది.

పూర్తి కావస్తున్న పనులు



మల్లయ్యకొండపైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వాచ్‌టవర్, రెండు పగోడాలు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం. వీటి నిర్మాణం పూర్తయితే కొండకు వచ్చే భక్తులు మరింత ఆహ్లాదాన్ని పొందవచ్చు. వీటితో పాటు కొండ పైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి సమారు రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న వాచ్‌టవర్



వాచ్‌టవర్ వద్దకు తాపల నిర్మాణం కోసం చదును చేసిన స్థలం



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న పగోడాలు

చందనాలంకారంలో వీరభద్రుడు





చందన అలంకారంలో వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో స్వామి, అమ్మవార్లకు చందన అలంకార వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ అమ్మవారికి, వీరభద్రుడికి ప్రత్యేక చందన అలంకార అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అక్షయ తృతీయ పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు ఆలయానికి వచ్చి చందన అలంకారంలో ఉన్న వీరభద్రస్వామి వారు, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అక్షయ తృతీయ విశిష్టత గురించి చందన అలంకారం విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనుకున్నదే చేశారు..!

- అంశాల వారీగా ఆమోదం
- నాలుగు అంశాల తిరస్కరణ
- నామమాత్రంగా కౌన్సిల్ సమావేశం



కశ్మీర్ ఉగ్ర దాడి మృతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న కౌన్సిలర్లు

మదనపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మదనపల్లె మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గతం కంటే భిన్నంగా సాగింది. కౌన్సిలర్ పెరవలి రాజేశ్‌తో పాటు ఒకరిద్దరు ఎజెండాలోని అంశాన్ని అంకెల వారీగా చెబుతూ, ఆమోదం, తిరస్కరణ (రద్దు) అంటూ సమావేశాన్ని నిమిషాల వ్యవధిలోనే ముగించేశారు. మార్చి నెలలో సమావేశంలో తొమ్మిది వార్డుల్లో రూ.5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎజెండాలో పేర్కొని, మిగిలిన వార్డులను గాలికొదిలేశారని వైసీపీ కౌన్సిలర్లు ఆందోళన చేశారు.

గత నెల ఎజెండా తరహాలోనే ఇప్పుడు కూడా 12 వార్డులకు రూ.5.27 కోట్లు పెట్టి, మిగిలిన 23 వార్డులను గాలికొదిలేశారని, ఈ ఎజెండాను కూడా రద్దు చేయాలని కౌన్సిలర్లు ఎస్.కరీముల్లా, మార్వారి నాగార్జునబాబు డిమాండ్ చేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనికి స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ ప్రతిసారి సమావేశాన్ని రద్దు చేస్తే తాగునీరు, శానిటేషన్, వీధిలైట్లు, తదితర పనులు, సేవలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రయారిటీ ప్రకారం, వార్డుల్లో ప్రజలకు అవసరమయ్యే పనులను మాత్రమే తాను ర్యాటిపై చేస్తున్నట్లు ప్రకటించారు. 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి మాట్లాడుతూ తమ వార్డుకు మంజూరు చేసి అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక వైసీపీ కౌన్సిలర్లు ఎజెండాలోని 20వ అంశాన్ని రద్దు చేశారని వాపోయారు. మున్సిపాలిటీలో టీడీపీ తరపున విజయం సాధించింది తానేనని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా..తన వార్డులో అభివృద్ధికి అడ్డు తగలడం ఏంటని ప్రశ్నించారు. పట్టణంలోని 35 వార్డుల్లో 33 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా, ఎన్నడూ లేని విధంగా ఇద్దరు మినహా సమావేశానికి అంతా హాజరయ్యారు.

సాధారణ, అత్యవసర సమావేశ ఎజెండాల్లోని నాలుగు అంశాలు మినహా మిగిలిన 28 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల కార్యాలయం పనిమీద విజయవాడకు వెళ్లడంతో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ శ్రావణి వ్యవహరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు ఆత్మశాంతి కలగాలని కౌన్సిల్ రెండు నిమిషాల మౌనం పాటించింది. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ తీవ్రవాదుల దాడి నేపథ్యంలో కేంద్రం తీసుకునే ఎలాంటి చర్యలకైనా తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

కన్నీరు మిగిల్చిన చామంతి

- దిగుబడి రాక తీవ్ర నష్టం




దిగుబడి రాని చామంతి పూల తోట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు చామంతి పూల తోట కన్నీరు మిగిల్చింది. వైరస్‌తో పాటు నీటి సమస్యతో పంట అనుకున్న ప్రకారం దిగుబడి రాకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చామంతి తోటలను సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుమారు 30 ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ఎకరా చామంతి తోటను సాగు చేయాలంటే సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 5 టన్నుల పూలు రావాల్సి ఉంది. కానీ వైరస్, నీటి సమస్యతో ఎకరాకు 2 టన్నులు మాత్రమే వచ్చాయి. వైరస్ కారణంగా పూల నాణ్యత కూడా తగ్గడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన పంటకు ఆశించిన రీతిలో ధర లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కిలో చామంతి రూ.100 నుంచి రూ.110 ఉండేది కానీ ప్రస్తుతం రూ.60 మాత్రమే ధర ఉండడంతో పెట్టుబడి కూడా రాలేదు. మండలానికి చెందిన భీమవరం, జయచంద్రారెడ్డి ఐదెకరాలు, పెసల శివారెడ్డి 8 ఎకరాలు, క్రిష్ణారెడ్డి 8 ఎకరాల్లో మరికొందరు రైతులు చామంతి తోటలను సాగు చేశారు. ఈ ఏడాది చామంతి పూలు తమను అప్పులపాలు చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైరస్‌తో తీవ్ర నష్టం



చామంతి తోటకు వైరస్ సోకడంతో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడిలో సగం కూడా రాలేదు. మండలంలో నీటి సమస్య కూడా అధికంగా ఉంది. ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందితే రైతులు సంతోషంగా ఉంటారు.

- భీమవరం జయచంద్రారెడ్డి, రైతు, ఒంటిమిట్ట

గంగోత్రిలో గల్లంతైన యువకుడు మృతి

మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేసుగారి బాలకృష్ణ (30) మంగళవారం హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఉన్న గంగోత్రి కొలనులో గల్లంతయ్యాడు. అప్పటికే చీకటి పడడంతో అతడి మిత్రులు, అధికారులు చేసిన గాలింపు చర్యలు సఫలం కాలేదు. దీంతో బుధవారం ఉదయం సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ములకలచెరువు నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, సిబ్బంది మానస సరోవరంలోని బోట్‌ను గంగోత్రిలోకి తరలించారు. రెండు శాఖల సిబ్బంది బోటులో కొలనులోకి గాలించి తాళ్లసాయంతో బాలకృష్ణ మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం సాయంత్రం బి.కొత్తకోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్‌డీఏ ప్రిలిమినరీలో 28 మంది

సైనిక్ స్కూల్ విద్యార్థులకు అర్హత

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా జరిగిన రాత పరీక్షలో కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన 28 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ సిహెచ్ పరదేశి తెలిపారు. ఏప్రిల్ 13న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వీరు సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) నిర్వహించే ఇంటర్వ్యూలో పాస్ కావాల్సి ఉంది. కలికిరి సైనిక్ స్కూల్ నుంచి 64 మంది ప్రిలిమినరీ పరీక్షలకు హాజరుకాగా అందులో 28 మంది అర్హత సాధించడం అరుదైన అంశమని తెలిపారు. ఇందులో ఈ ఏడాది 2024-25 బ్యాచ్ 12వ తరగతి విద్యార్థులు 18 మంది క్వాలిఫై కాగా, పది మంది గతేడాది బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులని వివరించారు. గత నాలుగు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థుల్లో ఇప్పటి వరకు 18 మంది ఎంపికై భారత సాయుధ దళాల్లో చేరినట్లు తెలిపారు. ఎన్‌డీఏ ప్రవేశ పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది బ్యాచ్‌కు (2024-25) చెందిన విద్యార్థులు 12వ తరగతి పూర్తి కాకుండానే గత అక్టోబరులో జరిగిన ప్రవేశ పరీక్షలకు హాజరయ్యారు. అందులో ఇటీవలే పూర్తయిన ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో నలుగురు విద్యార్థులు ఎంపికైన విషయం తెలిసిందే.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుకు చెందిన రవికుమార్ నిమ్మనపల్లి అగ్రహారం మార్గంలో బైక్‌పై వస్తుండగా తరిగొండవారిపల్లికి చెందిన పులి రెడ్డెప్పరెడ్డి తన ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు రెడ్డెప్పరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు



మద్యంతో పట్టుబడిన ఆనందకుమార్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని మినికి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీస్ గంగిరెడ్డి, శ్రీనివాసులతో కలిసి తనిఖీ నిర్వహించి ఆనంద్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 43 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా : ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లి మండలం కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మదనపల్లికి చెందిన అశోక్‌కుమార్ (22), ప్రదీప్ (24) మంగళవారం రాత్రి తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం నుంచి మదనపల్లికి వస్తుండగా ఎగువమాచిరెడ్డిగారిపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లి తరలించగా అక్కడ డాక్టర్లు తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి





విలపిస్తున్న మృతుడి తండ్రి ఇబ్రహీం, నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

చిన్నమండెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని షిఫాయత్‌ఖాన్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండెం మండల కేంద్రానికి చెందిన షిఫాయత్‌ఖాన్, ఖాదర్‌వలీలు ద్విచక్రవాహనంలో తన సొంత అవసరాల నిమిత్తం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యాహ్న సమయంలో కడప-బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని షిఫాయత్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా ఖాదర్‌వల్లి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం శివారులోని భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో ఆటో, స్కూటర్ ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఉదయం ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన రెడ్డిపోగు శంకరయ్య, క్రిష్ణయ్య బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొనడంతో కృష్ణ తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. శంకరయ్య కాలికి గాయమైంది. వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పందెం కోళ్లను వేలం వేసిన పోలీసులు



కోడిని వేలం వేస్తున్న పోలీసులు

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు గ్రామం సమీపంలోని ఒక తోటలో జరుగుతున్న కోడి పందాలపై దాడులు చేసిన కలికిరి పోలీసులు పందెంరాయుళ్లతో పాటు నాలుగు పందెం పుంజులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం జరిగిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న పందెంకోళ్లను వేలం వేసేందుకు వాయల్పాడు కోర్టు న్యాయాధికారి అనుమతి తీసుకున్నారు. ఆ ప్రకారం బుధవారం పోలీసుస్టేషను ఆవరణలో వేలం నిర్వహించగా రూ.6500లకు వేలం పాట నిలిచింది. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కోర్టు పద్దులో జమచేయనున్నట్లు కలికిరి ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్‌బాషా, హెచ్‌సీ మదనమోహన్‌రెడ్డి, పోలీసులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

ఆశయం ఘనం...

అమలు శూన్యం!

● నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

అసంఘటిత రంగంలోని కూలీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణలో విఫలమవుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయాల్లో కార్మికులకు పరిహారం, కార్మికుల పిల్లల చదువులకు సాయం, స్కాలర్‌షిప్‌లు అంటూ ఆకర్షణీయమైన మాటలు చెబుతూ కార్మికులకు దశాబ్ద కాలంగా పరిహారం ఇవ్వలేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల పండుగ అయిన మేడే సందర్భంగానైనా తమ సమస్యల గురించి ఎవరైనా పట్టించుకోకపోతారా అంటూ వారు ఆశగా చూస్తున్నారు.


పీలేరులో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు

● అలంకారప్రాయంగా కూలీల సంక్షేమ చట్టం
● పరిహారం కోసం కూలీల ఎదురుచూపు
● కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించిన వైసీపీ సర్కారు



పీలేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగానిదే అగ్రతాంబూలం. తామున్న చోటు లేక సమీప ప్రాంతంలోనే భుక్తి మార్గం మార్గం దొరుకుతుందన్న ఆశతో చాలామంది రైతులు, రైతు కూలీలు, సాధారణ కూలీలు తమ సంప్రదాయ వృత్తులను వదిలి భవన నిర్మాణ రంగంలోకి వెళుతుంటారు. శారీరకంగా దృఢంగా ఉన్నన్నాళ్లూ ఎటువంటి రిటైర్మెంట్ లేకుండా పనిచేసుకునే అనువైనది నిర్మాణం రంగం. అయితే నిత్యం ప్రమాదపుటంచుల్లో పనిచేసే ఆ రంగంలోని తాపీ మేస్త్రీలు, కూలీలకు రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట భవన నిర్మాణ రంగ కూలీలు మృత్యువాతపడుతూనే ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా మేస్త్రీలు, గృహ యజమానులు అందించే కాసింత పరిహారంతోనే ప్రమాదానికి గురైన వారు సరిపుచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రమాదాల కారణంగా అంగవైకల్యం పొందిన వారైతే చేసేది లేక ఇంటి పట్టునే ఉంటూ నిరాశతో జీవితం గడుపుతూ ఉంటారు. నిర్మాణ రంగంలోని ఇటువంటి ఇబ్బందులను తొలగించి మేస్త్రీలు, కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు-1999ను అమలు చేస్తున్నాయి. కేవలం నామమాత్రపు రుసుంతో కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పించేందుకు ఈ చట్టం రూపొందించబడింది. అయితే ఈ పథకం కేవలం అలంకారప్రాయంగా, ప్రభుత్వానికి ప్రచార అస్త్రంగా మిగిలిపోయిందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కార్మిక శాఖ అధికారుల ప్రోద్బలంతో తమ దగ్గర పనిచేస్తున్న కార్మికులకు ఎన్నో ఆశలు కల్పించి తాము నమోదు చేయిస్తున్నా వారికి ఎటువంటి పరిహారం అందడం లేదని వారు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించడంతో కార్మికులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

పీలేరు కార్మిక శాఖ కార్యాలయ పరిధిలో...

పీలేరు, కేవీపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల, తవణంపల్లె, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పాకాల మండలాల నుంచి ప్రస్తుతం 15 వేల మంది గుర్తింపు పొందిన కార్మికులు ఉండగా కార్మిక శాఖ వద్ద గుర్తింపు కార్డులు తీసుకోవడానికి ఆసక్తి చూపని వారు మరో 20 వేల మంది ఉన్నారని కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

పరిహారం కోసం 80 మంది ఎదురుచూపులు

పీలేరు కార్మిక శాఖ పరిధిలోని 11 మండలాల పరిధిలో 80 మంది కార్మికులు, వారి కుటుంబాలు పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అందులో రూ.5 లక్షల పరిహారం అందాల్సిన ప్రమాద మరణం కేసు చిన్నగొట్టిగల్లు మండలంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంది. పీలేరు మండలంలో ఎనిమిది, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, ఐరాలలో 14, తవణంపల్లెలో ఒకటి, చిన్నగొట్టిగల్లులో రెండు, పాకాలలో రెండు సహజ మరణం కేసులు, దహనక్రియల కోసం పీలేరులో ఎనిమిది, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, ఐరాలలో 14, తవణంపల్లెలో ఒకటి, చిన్నగొట్టిగల్లులో మూడు, పాకాలలో రెండు కేసులు పరిహారం కోసం వేచి చూస్తున్నాయి. వివాహ కానుక కోసం పీలేరులో రెండు, ప్రసూతి సాయం కోసం పీలేరులో నాలుగు, రొంపిచెర్లలో మూడు, పులిచెర్లలో ఒకటి, సదుంలో ఒకటి, తవణంపల్లెలో రెండు, చిన్నగొట్టిగల్లులో రెండు, పాకాలలో ఐదు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మిక శాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇవి మరిన్ని పెరిగే అవకాశం ఉందని కార్మిక సంఘ నేతలు చెబుతున్నారు.

సంక్షేమ బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలు

- పనిచేసే ప్రదేశాల్లో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షల పరిహారం. 50 శాతం లేదా అంతకు మించి అంగవైకల్యం పొందిన వారికి రూ.లక్ష పరిహారం. 26 శాతం నుంచి 49 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు పరిహారం. 25 శాతం వరకు అంగవైకల్యం పొందిన వారికి రూ.25 వేలు పరిహారం.
- సాధారణ మరణానికి రూ.60 వేల ఆర్థిక సాయం
- అంతిమ సంస్కార ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తారు.
- కార్మికుడి భార్యకు రెండు కాన్పులకు రూ.20 వేల ప్రసూతి సాయం లభిస్తుంది.
- భవన నిర్మాణ కార్మికులకు అనారోగ్య సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ.3 వేలకు మించకుండా మూడు నెలల వరకు చెల్లిస్తారు.
- జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ (న్యాక్) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, రాడ్‌బెండింగ్, వడ్రంగి విభాగాలలో రోజుకు రూ.300 శిక్షణ భృతి చెల్లిస్తూ ఉచిత, భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ అందిస్తారు.
- ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారికి జాతీయ పింఛను పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.
- బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన అవివాహితులైన మహిళా కార్మికులు, లబ్ధిదారులైన కార్మికుల కుమార్తెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వివాహ కానుకగా అందిస్తారు.
- కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా ప్రమాదంలో మరణిస్తే రూ.50 వేలు లేదా ప్రమాదం జరిగితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు.



కార్మిక శాఖ కరపత్రం

పరిహారం అందితే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది



సకాలంలో పరిహారం అందితే కార్మికులకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. అలా కాకుండా ఏళ్ల తరబడి ఇవ్వకపోతే ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుంది. పరిహారం చెక్కులు చివరగా 2014లో అందించారు. అదీ 2009లో పెండింగ్‌లో ఉన్న వాటిని 2014లో పంపిణీ చేశారు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడేమో కార్మిక శాఖ నిధులను నవరత్నాలకు మళ్లించారని చెప్పారు. మా నిధులు మాకిమ్మని ఎన్నోసార్లు ఎమ్మెల్యేల దగ్గర నుంచి మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వినతిపత్రాలు అందజేశాం. కూటమి ప్రభుత్వమైనా మా గురించి పట్టించుకుంటుందేమోనని ఎదురు చూస్తున్నాం.

● బలరాం, అధ్యక్షుడు, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

ప్రభుత్వానికి తెలియజేశాం



పీలేరు కార్యాలయ పరిధిలో 80 కేసులు పెండింగ్‌లో ఉన్న మాట నిజమే. వాటికి నిధులు కేటాయించమని ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించాం. నిధులు రాగానే చెల్లింపులు ప్రారంభిస్తాం. నిధులు లేకపోవడంతో సమస్య ఎదురైంది. అలాగని కార్మికులు నిరాశ చెందాల్సిన పనిలేదు. వారు కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుంటే కాస్త ఆలస్యంగానైనా వారికి రావాల్సిన ప్రయోజనాలు అందుతాయి. నిధుల లభ్యతతో సంబంధం లేకుండా మేము నిత్యం కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం.

● ఆనంద్, సహాయ కార్మిక శాఖాధికారి, పీలేరు

'ఉపాధి'తో బహుళ ప్రయోజనాలు

● డ్వామా పీడీ వెంకటరత్నం
● ఫారంపాండ్లు, నీటి తొట్లు పరిశీలన

సుండుపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల ద్వారా రైతులు, ప్రజలు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం సుండుపల్లె, మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో నీటి తొట్లు, ఫారంపాండ్లను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 36 నీటితొట్లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా ప్రస్తుతానికి 28 పూర్తయినట్లు తెలిపారు. ప్రభుత్వం హార్టికల్చర్‌లో భాగంగా 236 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి అనుమతులు ఇచ్చిందని రైతులు మంజూరు చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. అలాగే 300 ఎకరాల్లో గడ్డి పెంపకానికి అనుమతులు వచ్చాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా ఎంతమంది ఉపాధి పనులు చేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేలా చూడాలన్నారు. అనంతరం ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో మాలిక్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు గోవిందయ్య, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

50 తులాల బంగారం చోరీ

● తాళాలు వేసిన ఇంట్లో పట్టపగలే బంగారు నగల అపహరణ
● రాయచోటిలో దొంగల హల్‌చల్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో పలుచోట్ల దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో రాయచోటి పట్టణంలోని రాజు మెయిన్ స్కూల్ సమీపంలో విజయభాస్కర్ అనే వ్యక్తి ఇంటిలో రూ.50 లక్షల విలువ గల 50 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... రాజు స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న విజయభాస్కర్ తన కుమార్తెతో కలిసి కంటికి వైద్య పరీక్షల కోసం బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారున. తిరిగి 11.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా డోర్ పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూస్తే వస్తులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 50 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా ఇంటిలోని వెండి వస్తువులను దొంగలు తీసుకెళ్లకుండా అక్కడే పడేశారు. ఈ మేరకు అర్బన్ సీఐ వెంకటచలపతి, ఎస్ఐ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ జరిగిన ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ చలపతి

అలాగే మంగళవారం రాత్రి రాయచోటి పట్టణంలోని బస్టాండు నుంచి బంగ్లా రోడ్డు వద్దకు వెళ్లే దారిలోని కృష్ణ సెల్ పాయింట్‌లో చోరీ చేశారు. ఉదయం షాపు యజమాని పరిశీలించగా షాపులోని రూ.40 వేలు దొంగతనం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై అతను రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అంతేగాక మంళవారం రాత్రి దొంగలు కృష్ణ సెల్ పాయింట్‌కు పక్కన ఉన్న హోటళ్లల్లో కూడా దొంగతనానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఇటీవల కాలంలో పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసినప్పటికీ దొంగలు ఏదో ఒకచోట దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నారు. బస్టాండుకు ప్రధాన రహదారిలో ఉన్న కృష్ణ సెల్ పాయింట్ దొంగతనం జరగడంతో మిగిలిన షాపుల యజమానులు భయాందోళనలకు గురవుతున్నారు. కొందరు ఆకతాయిలు రాత్రి సమయంలో పాత సైదియా హాలును కేంద్రంగా చేసుకుని అటుగా వెళుతున్న వారిని భయపెట్టి బంగారం, డబ్బులు దోచుకుంటున్నట్లు స్థానికులు చర్చించుకోవడం కొసమెరుపు, పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో పాత సైదియా హాలు దగ్గర, పక్క వీధుల్లో గస్తీ పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

● పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్లు

రాయచోటి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన ఏపీ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి, కలికిరి పట్టణాల్లోని 11 పరీక్షా కేంద్రాల్లో 3981 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో బాలురు 2376 మంది ఉండగా, బాలికలు 1605 మంది ఉన్నారు. జిల్లాకు వచ్చిన ఏపీ పాలీసెట్ అబ్జర్వర్లు ఎంఎస్ సుకుమార్, ఏ.శివకుమార్‌లు పరీక్ష ఏర్పాట్లతో పాటు పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా కోఆర్డినేటర్ పి.శివశంకర్, డీఆర్వో మధుసూదన్‌రావు పరీక్షల నిర్వహణపై పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక పారిశుధ్యం పనులు చేపట్టి విద్యార్థులకు అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.


రాయచోటిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్లు

పీలేరు కాలనీల్లో 3 వేల మంది అనర్హులు

● రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్

పీలేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ లబ్ధిదారుల్లో 3,066 మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించామని రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. పీలేరు తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీలేరు పట్టణానికి చెందిన 8,468 మందికి గత ప్రభుత్వం నాలుగు లేఔట్లలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. అనర్హుల వద్ద ఉన్న ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహించిన క్షేత్రస్థాయి విచారణలో ఈ వాస్తవాలు వెలుగు చూశాయన్నారు. మండలంలోని లేఔట్లలో ఇంకా 3200 ఖాళీ స్థలాలు ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం ఇళ్లు లేని వారికి ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో దరఖాస్తులు తీసుకుంటున్నామని ఇప్పటి వరకు మండలంలో 3043 దరఖాస్తులు అందాయ న్నారు. జీవో నెం.30 ద్వారా వివాదాలు లేని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు రాయచోటి డివిజన్‌లో 257 మంది, పీలేరు మండలంలో 73 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పీలేరు మండలంలో రీసర్వే పనులకు తొలిదశలో వేపులబైలు పంచాయతీని ఎంపిక చేయగా, రెండవ దశ కోసం గూడరేవుపల్లె పంచాయతీని ఎంపిక చేశామన్నారు. గూడరేవుపల్లెలో తొలి దశ సర్వే పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సర్వే నెం.93లోని భవంతులపై కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశామని, కోర్టు ఉత్తర్వుల మేరకు వారికి ఎంత పరిహారం ఇవ్వాలో నిర్ధారించుకుంటామన్నారు. సర్వే నెం.93 పూర్తిగా ప్రభుత్వ భూమి అని, జాతీయ రహదారుల నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ భూమికి పరిహారం చెల్లించాల్సిన పనిలేదని, ఆయా భవన యజమానులకు ఇది వరకే స్పష్టం చేశామన్నారు. వారు కోర్టును ఆశ్రయించడంతో పనులు ఆలస్యం అయ్యాయన్నారు. అనంతరం ఆయన పీలేరు మండలంలోని పీజీఆర్ఎస్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, ఎన్‌హెచ్ డీఈ సత్యమూర్తి, డీటీ ప్రసాద్, సర్వేయర్ కీర్తన, తదితరులు పాల్గొన్నారు.


పీలేరు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్

వైభవంగా గంగమ్మ జాతర ప్రారంభం

● ఆకట్టుకున్న వేషధారణలు
● సంబరాల్లో మునిగితేలిన కోడూరు ప్రజలు

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లి జాతర ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతర సంబరాల్లో రైల్వేకోడూరు ప్రజలు మునిగిపోయారు. రాత్రి పూలపల్లకిని ఊరేగిస్తూ అంకాళమ్మ దేవస్థానం వరకు వస్తుంది. అక్కడ అర్ధరాత్రి గంగమ్మతల్లి విగ్రహాన్ని మట్టితో తయారు చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం గంగమ్మను పూలపల్లకీలో గంగమిట్ట వరకు ఊరేగిస్తారు. అర్ధరాత్రి నుంచి వేలాది మంది జనాలు వచ్చి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులు సమర్పిస్తారు. గంగమ్మ నిలిపేచోట వేపమండలతో గుడి తయారు చేశారు. ఇక్కడే గంగమ్మను నిలబెడతారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమౌతాయి. కాగా వివిధ రకాల అమ్మవారి వేషాలు, విజయవాడ తప్పెట్లు, డ్రమ్స్, పొడుగు మనుషులు, పొట్టి మనుషుల వేషాలు, పెద్ద, పెద్ద అమ్మవారి వేషాలు తదితరవి ప్రజలను ఆకట్టుకున్నాయి. గంగమిట్ట, ప్రధానదారి, అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలంకరణలు చేశారు. ప్రధాన రహదారిలో గంగమ్మతల్లి ప్రతిమలతో కూడిన విద్యుత్ బోర్డులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.


గంగమిట్ట వద్ద వేపమండలతో ఏర్పాటు చేసిన గుడి


ప్రజలను ఆకట్టుకున్న అమ్మవారి వేషాలు

150 మందితో పోలీసు బందోబస్తు

గంగమ్మతల్లి జాతరకు 150 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, ఎస్ఐ జి.నవీన్‌బాబు తెలిపారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ జాతర సందర్భంగా 34 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాతో నిరంతరాయంగా నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్ఐలు, హోంగార్డులు తదితర సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం



కలశ పూజలు చేస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి

పెద్దమండ్యం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని పాపేపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతి మహాస్వామి ఆలయ రాజగోపురంపై కలశాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి హాకీ, బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాలు

మదనపల్లె అర్బన్ ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండ లంలోని సీటీఎం జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి అనగా మే 31 వరకు డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ, జినరాజ దాస హాకీ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ హాకీ, బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ, నరేష్‌బాబు తెలిపారు. 8 నుంచి 14 ఏళ్లలోపు వయసు కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ శిక్షణ పొందేందుకు అర్హులని, శిబిరంలో పాల్గొనదలచినవారు తమ ఆధార్‌కార్డు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో తెచ్చుకోవాలని, ఉదయం 6 గంటల నుంచి 8.30 వరకు, సా యంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 7032140712, 9885055402 లో సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ శిక్షణ

జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ అన్నమయ్య శాప్ ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ఉన్నత పాఠశాలతోపాటు మిషన్ కాంపౌండ్, ఆరోగ్యవరం, పీలేరుల్లో సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంపు, నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ మురళీధర్ తెలిపారు. మరిన్ని వివరాలకు మదనపల్లె జిల్లా ప్రనిసత్ ఉన్నత పాఠశాలలో క్యాంపు ఇన్‌చార్జి మహేంద్ర నాయక్ 9703110713, 8096607782 ను సంప్రదిం చాలన్నారు.

మే డేను జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్ రెడ్డిసాహెబ్ పిలుపు నిచ్చారు. బుధవారం తమ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీని వాసులుతో కలిసి ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, కోమటి వానిచెరువు సమీపంలో మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించే కార్యక్రమానికి ప్రతి గ్రా మం నుంచి కార్మికులు తరలిరావాలన్నారు. స్థాని క ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్,లేబర్ ఆఫీసర్, తహసీల్దార్ దనంజయులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో లాగా కాకుండా అధికారులు ప్రజల కోసం పనిచేయాలన్నారు.ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. గ్రామ సభలలో ఇచ్చిన అర్జీలు కూడా పరిష్కారం కాలేదని, వాటిపై కూడా దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఉన్న అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా తహసీల్దార్లతో చర్చించామన్నారు. రూ.2 వేల కోట్లతో గండికోట రిజర్వాయర్ నుంచి పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తన అన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో చేపట్టిన హంద్రీనీవా పనులు పీలేరు నియోజకవర్గంలో ఆగిపోయాయని రెండేళ్ల వ్యవధిలో అవికూడా పూర్తి చేస్తామన్నారు. స్థానికంగా సబ్‌జైలు, అగ్నిమాపక కేంద్రం నూతన భవనాలు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో, తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేలా చూశామని, టీటీడీ అధికారులతో చర్చించి ఆలయాల పుష్కరిణులు అభివృద్ధి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, నాయకులు కృష్ణారెడ్డి, కోసూరి చంద్రమౌళి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, కూటమి పార్టీల మైనార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహల్ మసీదు భూముల హక్కు పత్రాలు అప్పగింత

కలికిరి : మండలంలోని మహల్ మసీదుకు సంబంధించిన భూమి హక్కు పత్రాలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. బుధవారం రాత్రి నగరిపల్లెలో జరిగిన ఒక కార్యక్రమంలో మహల్ గ్రామ సర్వే నంబరు 61/1 లోని 1.19 ఎకరాల భూమికి సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టరు జారీ చేసిన హక్కు పత్రాలకు ఆయన మసీదు పెద్దలకు అప్పగించారు. ఒక ప్రైవేటు వ్యక్తికి, మసీదుకు మధ్య ఈ భూమి హక్కులకు సంబంధించిన వివాదం జాయింట్ కలెక్టరు కోర్టులో ఉంది. పలు రకాల రికార్డులను, ఆధారాలను పరిశీలించిన జాయింట్ కలెక్టరు ఈ భూమి మసీదుకే చెందుతుందని ఉత్తర్వులు జారీ చేశారు. మహల్ మాజీ సర్పంచులు మహ్మదాలీ, ఖాజా హుస్సేన్, పెద్దలు ఇబ్రహీం, తమీమ్‌ఖాన్, మున్వర్ ఆలీ, రియాజ్‌ఖాన్, అమీర్ కాకర్, మహబూబ్ బాషా, ఐటీడీపీ అధ్యక్షుడు షబ్బీర్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తఫా హజరత్‌కు నివాళులు

మంగళవారం రాత్రి మృతి చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు, జమీయత్ ఉలేమా-ఏ-హింద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ముస్తఫా హజరత్ భౌతికకాయానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం క్రాస్ రోడ్డులోని ముస్తఫా ఇంటికెళ్లి భౌతిక కాయానికి పూల మాలలు వేసి సంతాపం ప్రకటించారు. ముస్తఫా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం మధ్యాహ్నం ముస్తఫా అంత్యక్రియలు పూర్తయ్యాయి

రీసర్వే పకడ్బందీగా చేయండి



రైతులతో మాట్లాడుతున్న రీసర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

పెద్దమండ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పనులు పకడ్బందీగా చేయాలని డివిజన్ రీసర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలసి బుధవారం ఆయన పెద్దమండ్యం మండలంలో పర్యటించారు. వెలిగల్లు గ్రామ పరిధిలో రీసర్వే పనులను పరిశీలించారు. అనంతరం వెలిగల్లు సచివాలయంలో మాట్లాడు తూ ఉమ్మడి భూముల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు తమ భూమి విస్తీర్ణం, సాగు అంశాలు అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, ఆర్‌ఐ సయ్యద్ ఇమ్రాన్, వీఆర్‌వోలు శ్రీనివాసులు, నవాజ్, విలేజ్ సర్వేయర్లు రాధ, విజయ లక్ష్మి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేంపల్లె రైతుల ఆందోళన

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారులపై చర్యలు తీసుకుని శ్మశాన స్థలాన్ని కాపాడాలని జిల్లా సీపీఎం కా ర్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తమ గ్రామాలకు చెందిన శ్మశానాన్ని కబ్జా చేశారంటూ బుధవారం కన్నెమడుగువారిపల్లె, దిగువ కొనకుంట్లవారిపల్లె, ఎగువ కొనకుంట్లవారి పల్లెలకు చెందిన ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ఆందోళన చేశారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోతే డీటీ బాబ్జీకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది రియల్టర్లు శ్మశానా నికి అనుకుని ఉన్న ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి ప్రభుత్వ స్థలాన్ని, శ్మశానాన్ని అక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపిం చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన స్థలాన్ని కాపాడాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐటీయూసీ కృష్ణమూర్తి, గ్రామస్థులు రెడ్డెప్ప, రాజన్న అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ పునరుద్ధరణ

కలకడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) :కలకడ వారపు సంత ప్రాంగణంలోని ఆర్వో ప్లాంట్ రెండేళ్ల తరువాత వినియోగంలోకి వచ్చింది. ప్రతి కుటుం బానికి స్వచ్ఛమైన తాగునీరు అందివాలనే లక్ష్యంతో గత టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద రూ.6 లక్షల వ్యయంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2023 వేసవికి ముందు ఫిల్టర్ దెబ్బతినడం తో ప్లాంట్ నిరుపయోగకరంగా మారింది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలపై గతంలో పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు మరమ్మతులు చేయించారు. బుధవారం నుంచి తాగునీటి సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌రహీం, సర్పంచ్ ప్యారీజాన్, కార్యదర్శి దేవేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూముల బహిరంగ వేలానికి ఏర్పాట్లు చేయండి

● దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశం



అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ భూముల బహిరంగ వేలానికి ప్రకటన విడుదల చేయాలని ఈవో ముని రాజ్‌ను దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలో దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలను పరిశీలించారు. పోతుపేట వద్ద చెన్నకేశవస్వామి ఆలయ భూములు 15 ఏళ్లుగా ఓ వ్యక్తి ఆధీనంలోనే ఉన్నాయని టీడీపీ నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, పోతుపేట చిన్నపరెడ్డి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మే 10న ఈ ఆలయానికి సంబంధించిన భూములను లీజు హక్కులను బహిరంగ వేలం వేయాలని ఆదేశించారు. ముందుగా గతంలో లీజు పొందిన రైతుకు నోటీసులు అందచేయాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కందుకూరు వేదగిరి నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని 385 ఎకరాల భూముల లీజు హక్కులకు త్వరలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు అందుకుంటున్న అర్చకుల వివరాలను ఆయన సేకరించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం



మామిడి పంటను పరిశీలిస్తున్న రవిచంద్రబాబు

కలకడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగైన మామిడి పంట స్థితిగతులపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవిచంద్రబాబు అధ్యయనం చేశారు. బుధవారం ఆయన జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణారావుతో కలిసి కోన గ్రామానికి చెందిన రైతు విశ్వనాథ్ మామిడి తోటను పరిశీలించారు. గతంలో అవలంబించిన రసాయనిక, ఇప్పటి సేంద్రియ వ్యవసాయానికి అయిన ఖర్చు, అనుభవాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఫ్రూట్ కవర్స్ వినియోగాన్ని గమనించి రైతును అభినందించారు. ఈ విధానంతో మంచి దిగుబడి, నాణ్యత, పంట సంరక్షణతోపాటు మంచి మార్కెటింగ్ అవకాశాలుంటాయని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి, హెచ్‌వో కుమార్‌రెడ్డి, ఈహెచ్ఏ అక్రమ్‌బాషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు?

● పౌరహక్కుల సమావేశంలో దళిత నాయకులు



అధికారులను నిలదీస్తున్న దళిత నాయకులు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళిత వాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తవళం పంచాయతీ ఎగువ పల్లి దళితవాడలో పౌరహక్కుల పరిరక్షణపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు సమావేశాల్లో ఇచ్చిన అర్జీల్లో ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గ్రామంలో మురుగు కాలువలు, విద్యుత్ దీపాలు లేవని తెలిపారు. మాలమహానాడు అధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ మండలంలో 46 దళితవాడలుండగా ఎస్సీ కార్పొరేషన్ కింద కేవలం 9 యూనిట్లు మాత్రమే ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. విద్యుత్ అధికారులైతే ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని తెలిపారు. తహసీల్దార్ అమరనాథ్ మాట్లాడుతూ ప్రతి నెల ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళిత వాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నా మని తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏవో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్‌చక్రవర్తి, ఎంఈవో-2 నారాయణ, సర్వేయర్ గోపి, ఏపీఎం మురళి, ఏపీవో రమేష్, కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం:సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ వెల్లడించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీటీ విద్యాసాగర్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలలో ఎయిడెడ్ కోర్సులు ప్రారంభించాలి



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతి పత్రం ఇస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడెడ్ కోర్సులను మళ్లీ ప్రారంభించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో షాజహాన్‌బాషా ఇచ్చిన హామీల మేరకు ఈ విద్యాసంవత్సరం నుంచి బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సులు ప్రారంభించాలన్నారు. అలాగే బీటీ కళాశాలను యూనివర్సిటీగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీవైఎస్ నాయకులు శశికుమార్, హరికృష్ణ, నితీష్, వినయ్, సాయికిరణ్, భార్గవ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. బుధవారం తంబళ్లపల్లెలో సాయి లోకేశ్ ఆధ్వర్యంలో 16 మంది సభ్యులతో కూడిన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసి, గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచిం చారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం లో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకట్రమణ, నాయకులు గోపాల్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, సుబ్బయ్య, హరినాథరెడ్డి, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లెలో బుధవారం అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ కవిత అనే మహిళకు రూ. 1,39,442 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చుక్కును పంపిణీ చేశారు. మండల బీజేపీఅధ్యక్షుడు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రాపూరివాండ్లపల్లె శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటనారాయణ, కార్యం శంకర, మల్లెం శివయ్య, బాస్కర్‌రెడ్డి, సుబ్బమ్మ, రామచంద్ర, శ్రీరాములు, ప్రభాకర్, రమణ, శివ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 41 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి

పీలేరురూరల్,ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 41 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఈ జాబ్‌మేళాకు పీలేరు పరిసర ప్రాంతాలకు చెందిన 110 మంది హాజరు కాగా, ఇంటర్వ్యూ అనంతరం 41 మంది ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యం నిర్దేశించుకొని కృషి చేస్తే జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. చేసే పని ఏదైనా అంకితభావంతో చేయాలని సూచించారు. ఇందులో టాటా క్యాపిటల్, గిగి ఐయా, ముత్తూట్ ఫైనాన్స్, డైకిన్, టైచీ కాస్ట్ టెక్, హీరో మోటార్స్ కార్స్, ఫోక్స్‌కాన్ కంపెనీలు పాల్గొన్నాయి. ఎంపికైనవారికి ప్రిన్సిపాల్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాయట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అధికారి డోనప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్, హరీష్, భరత్, గణేష్, సుజాత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు అరికడదాం'

పీలేరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో బాల్యవివాహాలు అరికడదామని కేవీపల్లె ఎంపీఎం అనురాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి పిలుపునిచ్చారు. బుధ వారం కేవీపల్లె ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు 12 సెషన్లుగా గ్రామస్థాయిలో కిశోరి వికాస కార్యక్రమంనిర్వహిస్తామని తెలిపారు. మొదటి సెషన్‌లో బాలికల పరిచయం నుంచి రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహం, పునరుత్పత్తి, ఆరోగ్యంపై చర్చిసామన్నారు. బాలల హక్కులు,రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. కౌమార దశలో ఇనుము లోపం, లింగ అసమానత, విద్యా కేరీర్ మార్గదర్శకత్వం, సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కౌమార బాలికల భద్రత, ఆర్థిక నిర్వహణ, సాధికారత, వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు అన్నపూర్ణ, శంకరమ్మ, భారతి, పీహెచ్‌వో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ తత్వం అలవర్చుకోవాలి..

వాల్మీకిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వంతో మంచి ఫలితాలు సాధించవచ్చునని వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు, ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్లు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి..



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు క్యాన్సర్ వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండల హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని నగిరిమడుగు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలను తెలియజేశారు. అనంతరం ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది నౌషాద్, ఆశ వర్కర్లు, నజీమున్నీసా, లలిత, శోభారాణి పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల సౌకర్యాలకు పెద్దపీట

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెడతామని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్ తెలిపారు. బుధవారం విజయవాడలోని హజ్ కమిటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ హజ్‌యాత్రకు వెళ్లే వారికి నోడల్ అధికారులను నియమించడం, పికప్, డ్రాప్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రం నుంచి 1,630 మంది హజ్‌యాత్రకు వెళ్లేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషా, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రెండు సెంటర్లలో బుధవారం నిర్వహించిన పాలిసెట్‌కు 1,424 మంది విద్యార్థులకు గాను 1,272 మంది హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచారు. ఈ రెండు సెంటర్లను అబ్జర్వర్ భక్తవత్సలం, కో ఆర్డినేటర్ ఓబులేసు, రూట్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

గుర్రంకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలి బకాయిలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తరిగొండ, టి.రాచపల్లె, మర్రిపాడు, రెడ్డివారిపల్లె, వంకాయలవారిపల్లె, రామాపురం తదితర గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి కూలీలకు నాలుగు వారాలకు సంబంధించిన కూలి అందకపోవడంతో ఆయా కార్మికులకు కుటుంబపోషణ కష్టంగా మారిందని తెలిపారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న టమోటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

92 మద్యం సీసాలు స్వాధీనం

పెద్దమండ్యం,ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా విక్రయిస్తున్న 92 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. బుధవారం మండలంలోని బాటవారిపల్లిలోని చిల్లర దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పెద్దమండ్యం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. 92 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఆనంద్‌రెడ్డి తో పాటు ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.